క్లుప్తంగా

22న సర్వసభ్య సమావేశం

గూడూరు: ఈనెల 22వ తేదీన గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

భావదేవరపల్లి(నాగాయలంక): లలితాదేవి చారిటబుల్ ట్రస్ట్(చల్లపల్లి) ఆధ్వర్యంలో గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 40మంది 10వ తరగతి విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు వితరణ చేశారు. గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ చేతుల మీదుగా మంగళవారం వీటిని ట్రస్టు చైర్మన్ ఎంవీ కృష్ణారావు(రిటైర్డ్ డీటీ) అందజేశారు. హెచ్‌ఎం జ్యోతిర్మయి, ముమ్మారెడ్డి రాంబాబు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



నాగాయలంక: అవనిగడ్డ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో 50మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ-పడాయి భీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణను మంగళవారం సీడీపీఓ పీ శేషుకుమారి ప్రారంభించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాల్యదశలో పోషణతోపాటు విద్యను ఎలా అందించాలి, పిల్లల శారీరక అభివృద్ధి, భాష, మోథోసంపత్తి, భావోద్వేగ, సామాజిక అభివృద్ధి పెంపొందించే అంశాల సమన్వయమే ఈ శిక్షణ ఉద్దేశమని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్ వైజర్లు ఎస్ నిర్మల, వీ రత్నమాల శిక్షణ ఇచ్చారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్ష

పెడన: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో 209 మంది విద్యార్థులకు 202 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ రామారావు, డిపార్ట్‌మెంట్ అధికారి మున్వనర్ తెలిపారు. విజయానంద జూనియర్ కళాశాల కేంద్రంలో 134 మందికి గాను 128 మంది హాజరయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ హిరణ్మయి, డిపార్ట్‌మెంట్ అధికారి నిజాముద్దీన్ పేర్కొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ సామాజిక వర్గాల వారు స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు సామాజిక వర్గాలతో పాటు మేదరి, కుమ్మరులు ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పట్టణ ప్రాంతంలో రూ. 1.03 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ. 81 వేలు సంవత్సర ఆదాయం మించకుండా 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. అలాగే 21 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు కలిగిన కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుమ్మరి, మేదర కులాలకు చెందిన వారు బుట్టల అల్లకం పథకానికి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. తెల్లరేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో కలిపి ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

96 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



ఎదురుమొండి(నాగాయలంక): మండలంలోని దీవి గ్రామం ఎదురుమొండిలోని ఓ షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 96 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని నాయుడు అంకాలమ్మకు చెందిన షెడ్డులో అక్రమంగా ఉంచిన రేషన్ బియ్యం విషయంపై అధికారులకు ఫిర్యాదు అందడంతో తనిఖీలు నిర్వహించారు. షెడ్డులో ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని అవనిగడ్డ పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ ఖాసిమ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మించాలి

చల్లపల్లి: చల్లపల్లి నారాయణరావు నగర్‌లోని గురుకుల పాఠశాల దగ్గరలో ఒక కమ్యూనిటీ హాలును నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సీపీఎం నాయకులు మంగళవారం చల్లపల్లి నారాయణరావు నగర్‌లో పర్యటించారు. పార్టీ మండల కార్యదర్శి యద్దనపూడి మధు, ఇతర నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు మహమ్మద్ కరీముల్లా, బళ్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెలరేగుతున్న మట్టిమాఫియా

- ఇష్టానుసారంగా చెరువుల్లో అక్రమ తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



కృత్తివెన్ను మండలంలోని మాట్లాం గ్రామం చెరువులో తవ్వకాలు

కృత్తివెన్ను: చెరువుల్లో అనధికార తవ్వకాలకు, అక్రమ మట్టితోలకాలకు కృత్తివెన్ను మండలం అడ్డాగా మారిపోయింది. ప్రస్తుతం దాళ్వా లేకపోవడంతో మట్టితోలకాలు ఊపందుకున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాకు పొరుగునే ఉండటంతో అధికశాతం మట్టి పక్క జిల్లాలకు రవాణా అవుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులకు చీమ కుట్టినట్టయినా లేకపోవడం శోచనీయం. మండలంలోని చినపాండ్రాక, ఇంతేరులతోపాటు మరి కొన్ని గ్రామాల్లో యథేచ్ఛగా మట్టి రవాణా జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సామాన్యుడు నాలుగు ట్రక్కుల మట్టిని తోలుకోవాలంటే అధికారులు పలు ఆంక్షలు విధిస్తారు. కానీ ఇక్కడ లక్షల్లో మట్టి తోలకాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడంపై సర్వత్రా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

తీరప్రాంతం కావడంతో చెరువుల తవ్వకాలు మండలంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. అనుమతులు లేకపోయినా తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అయితే అధికారులు మాత్రం అటువైపు కనీసం కన్నెత్తయినా చూడకపోవడం విడ్డూరం. మండలంలో వందలాది ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. కొందరు బడాబాబులు రైతుల నుంచి భూములను లీజుకు తీసుకుని భారీ చెరువుల పేరుతో ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించేసి చెరువులు తవ్వేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తవ్వకాలకు, మట్టితోలకాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలతో జేబులు నింపుకొంటున్న వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లు

అనుమతులు లేవు

చెరువుల్లో అక్రమంగా తవ్వకాలు, అనధికారికంగా మట్టితోలకాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. మట్టితోలకాలు, చెరువుల్లో తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. వాటిని గుర్తించి వెంటనే పనులు నిలిపివేయిస్తాం.

– శశికుమార్, డెప్యూటీ తహసీల్దార్

లైబ్రరీ నిర్వహణపై ఎంపీపీ ఆగ్రహం



బంటుమిల్లి లైబ్రరీని పరిశీలిస్తున్న ఎంపీపీ చినబాబు

బంటుమిల్లి: లైబ్రరీలో పాఠకులకు సౌకర్యాలు లేకుండా పోటీ పరీక్షలకు విద్యార్థులు ఏలా సిద్ధమవుతారంటూ అక్కడ పరిస్థితులు, నిర్వహణపైన ఎంపీపీ వీ చినబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక లైబ్రరీని మంగళవారం ఆయన సందర్శించాడు. ఈ సందర్భంగా ఆయన లైబ్రరీలో కనీసం ఫ్యాన్లు, బల్లలు, కుర్చీలుగాని లేకుంటే పాఠకులు ఏలా వస్తారని సిబ్బందిని ప్రశ్నించాడు. లైబ్రరీ స్థితిగతులపై జిల్లా అధికారి వీ రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి లైబ్రరీలో సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే మండల పరిషత్ నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ చినబాబు జిల్లా అధికారితో పేర్కొన్నారు.

భావదేవరపల్లి రోడ్డులో గ్రామస్తుల ఆందోళన



వక్కపట్లవారిపాలెం-భావదేవరపల్లి రోడ్డులో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): ఈ ఏడాది సంక్రాంతి నాటికి రోడ్డు మరమ్మతులు చేస్తామన్న ఓఎన్‌జీసీ సంస్థ అధికారులు, ప్రభుత్వ పాలకులు ఇప్పటికీ పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు మంగళవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని వక్కపట్లవారిపాలెం సమీపంలో ఓఎన్‌జీసీ నిర్వహిస్తున్న చమురు అన్వేషణ క్షేత్రాల అధికారుల నిర్లక్ష్య ధోరణిపై వక్కపట్లవారిపాలెం, భావదేవరపల్లి గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్కపట్లవారి పాలెం లాకుల నుంచి భావదేవరపల్లి ప్రధాన మార్గంలో ఓఎన్‌జీసీ చమురు అన్వేషణ సంస్థ సైట్‌లకు వచ్చే వాహనాలు, ఆయిల్ టాంకర్లను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ సీఐ యువకుమార్ ఘటన స్థలానికి చేరుకొని తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ ఫోన్‌లో చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. గ్రామస్తులు మండలి నరేష్, అంబటి లక్ష్మణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వేను వేగవంతం చేయాలి

ఎంపీడీవో స్వర్ణభారతి

మోపిదేవి: ఇంటింటా నిర్వహించే పబ్లిక్, ప్రైవేటు పీపుల్ పార్టనర్‌షిప్ (పీ-4) సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో జే స్వర్ణభారతి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ కార్యదర్శుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో సిబ్బందికి అప్పగించిన సర్వేలు నత్తనడకన సాగుతున్నాయని, వేగవంతంచేసి ఈనెల 18లోగా సర్వేలు పూర్తిచేయాలని సూచించారు. సర్వేల ఆధారంగానే సమాజంలో అతిపేదవాడిని గుర్తించి వారికి కనీస సౌకర్యాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. రాబోవు వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈవోపీఆర్డీ త్రిపురసుందరి, గ్రామ కార్యదర్శులు రామకోటేశ్వరావు, నాగమల్లేశ్వరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధిలేని కొత్తవాహనాలు



రావివారిపాలెం సచివాలయం వద్ద మూలనపడిన చెత్త సేకరించే వాహనం



చెత్తను తరలించే ట్రాక్టర్



డ్రెయినేజీలో పూడిక తీసే వాహనం

తడి చెత్త, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించేందుకు, గ్రామాల్లో శానిటేషన్ చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేటాయించిన వాహనాలు పంచాయతీ కార్యాలయాల్లోనే తుప్పు పడుతున్నాయి. ఇటీవల జిల్లా కలెక్టర్ స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర పేరుతో తడి, పొడి చెత్త వేరు చేసి స్థానికంగా ఉండే చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు తయారీ చేస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుందని పదే పదే చెబుతున్నారు. కానీ రావివారిపాలెం గ్రామంలో స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో గత ఏడాది వచ్చిన కొత్త వాహనాలు తుప్పు పట్టి మూలన పడి ఉన్నాయి. ఇప్పటికైనా మూలన పడిన వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– మోపిదేవి

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

పెడన: విద్యార్థులకు చదువుతోపాటు చట్టాల గురించి తెలియాల్సిన అవసరం ఉందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. పట్టణంలోని బట్టా జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు చట్టాలను విద్యార్థులకు వివరించారు. పోక్సో, వాహనం, బాల్యవివాహాలు తదితర చట్టాల గురించి న్యాయమూర్తి అవగాహన కలిగించారు. హెచ్‌ఎం ఏ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ సదస్సులో న్యాయవాదులు సీహెచ్ మసలయ్య, ఎంతఓ హరనాథ్, ఉపాధ్యాయులు బీబీ తీర్థావతి, కే ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చల్లపల్లి: చల్లపల్లి మండలం లక్ష్మీపురం సబ్‌స్టేషన్ పరిధిలోని మంగళాపురం గ్రామంలో బుధవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ డీ కృష్ణనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనులకు సంబంధించి విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు కారణంగా విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బడ్డీకొట్ల తొలగింపు



మచిలీపట్నంటౌన్: నగరంలోని చింతచెట్టు సెంటర్ నాగపూర్ సెంటర్ వెంకటేశ్వర థియేటర్ పక్కన రోడ్డులో డ్రెయిన్లపై ఏర్పాటు చేసిన బడ్డీకొట్లను మంగళవారం తొలగించారు. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది జేసీబీ, క్రేన్ సాయంతో ఆక్రమణలను తొలగించారు. చింత చెట్టు సెంటర్‌లోని దుకాణదారులు తొలగింపు ప్రక్రియను కొద్దిసేపు అడ్డుకున్నారు. అధికారులు మార్కింగ్ ఇవ్వడంతో అక్కడి వరకు వారే స్వయంగా తొలగించేందుకు వ్యాపారులు ఒప్పుకున్నారు. ఆక్రమణల తొలగింపు పనులను కమిషనర్ బాపిరాజు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీహరి ప్రసాద్ పర్యవేక్షించారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

కోనేరుసెంటర్: మచిలీపట్నం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం మండలంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో బందరు మండలం నవీన్‌మిట్టల్ కాలనీకి చెందిన వేముల దశరథరాముడు అనే వ్యక్తి నుంచి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దశరథరాముడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వరమ్మ తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి టీవీవీ మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజైన బుధవారం స్వామి, అమ్మవారిని పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెలను చేస్తామన్నారు. గురువారం ఎదుర్కోల సన్నాహము, జగజ్యోతి అనంతరం స్వామివారి దివ్యకల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆలయంలో భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాత్రి స్వామివారి రథోత్సవం, నరసింహస్వామి కోలలు ఉంటాయన్నారు. చివరి రోజైన శనివారం స్వామివారి పుష్పయాగోత్సవం, ద్వాదశ ప్రదక్షిణలు, పవలింపు సేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని వివరించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



కోడూరు: మండలంలోని ఊటగుండం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత దేవనబోయిన నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మంగళవారం నాగరాజు కుటుంబసభ్యులను పరామర్శించారు. నాగరాజు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు బడే గంగాధరరావు, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు చేబోయిన కృష్ణారావు, వెన్నా ప్రసాద్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సబ్ ట్రెజరర్, అకౌంటెంట్ సస్పెన్షన్

అవనిగడ్డ: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో జరిగిన అక్రమాల్లో సబ్ ట్రెజరర్, అకౌంటెంట్‌ని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెన్షన్, ఇతర బెనిఫిట్స్ ఎక్కువ ఇచ్చినట్టు చూపించి అకౌంటెంట్ వెంకటరెడ్డి రూ.1.50 కోట్ల వరకూ ప్రభుత్వ నిధులను స్వాహా చేశారు. ఈ విషయమై జిల్లా అధికారులు విచారణ చేయగా అవినీతి జరిగినట్టు రుజువు కావడంతో అకౌంటెంట్ వెంకటరెడ్డితో పాటు పర్యవేక్షణ చేయని సబ్ ట్రెజరర్ ఆదిశేషుని సస్పెండ్ చేసినట్టు ట్రెజరీ డెప్యూటీ డైరెక్టర్ శ్రావణం రవికుమార్ మంగళవారం తెలిపారు. అకౌంటెంట్‌పై అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు జగనన్న మోడల్ కాలనీలో ప్రభుత్వం కాలనీవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల పార్టీ ఆధ్వర్యంలో నాయకులు మౌలిక సౌకర్యాలు తదితర సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం గ్రామంలో పర్యటించారు. ఇందులో భాగంగా స్థానిక జగనన్న కాలనీవాసులు కాలనీకి మధ్యలో ఉన్న రోడ్డులో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. అలాగే నేటికి తాగునీటి సౌకర్యం లేదని, అంతర్గత రోడ్ల నిర్మాణం జరగలేదంటూ సీపీఎం నాయకుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ కాలనీ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి మాజేటి శ్రీనివాసరావు, వెంట్రపాటి శ్యాంబాబు, పాదిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ చేయూత



మచిలీపట్నం అర్బన్: నగరంలోని మూడు స్థంభాల సెంటర్ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన సీహెచ్ జయలక్ష్మి, పీ పార్వతి, కే నాగమణి కుటుంబాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేయూతనందించింది. బాధితులకు మంగళవారం టార్పాలిన్, వంట పాత్రలు, సబ్బులు, హైజెన్ కిట్స్, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ భవిరి శంకర్‌నాథ్, ట్రెజరర్ రాంబాలాజీ, డిజాస్టర్ మేనేజ్మెంట్ కన్వీనర్ కే కృష్ణతేజ, కోఆర్డినేటర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి మాస్టర్ ఈకే బాలభాను విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. స్కూల్ నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికి తీసే విధంగా సైన్స్, గణితంకు సంబంధించి సుమారు 200 అంశాలను విద్యార్థులు ప్రదర్శించారని తెలిపారు. నాలుగు నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులు సైన్స్, గణితం ఎగ్జిబిషన్‌లో పాల్గొని విభిన్న ఎగ్జిబిట్‌లను తయారుచేసి ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా నర్సరీ నుంచి మూడో తరగతి విద్యార్థులు చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సారా రహిత సమాజానికి కృషి చేద్దాం



నవోదయం 2.0 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఈఎస్ భార్గవ తదితరులు

కోనేరుసెంటర్: సారా రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మచిలీపట్నం ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సీ భార్గవ సూచించారు. బందరు మండలం పోలాటితిప్ప గ్రామంలో మంగళవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా మహమ్మారిని నిర్మూలించేందుకు ఎక్సైజ్‌శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. సారా తయారీ, రవాణ, విక్రయాలు చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారీ అనేది గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఉంటుందన్నారు. అందులోనూ సముద్రపు అంచున ఉండే అడవుల మధ్య అధికంగా తయారవుతోందన్నారు. సారాకు సంబంధించి ప్రజల వద్ద ఎలాంటి సమాచారం ఉన్నా ఎక్సైజ్ అధికారులకు తెలియజేసి సహకరించాలని కోరారు.

పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం

సారా తయారీ, రవాణ, అమ్మకాలు జరుపుతూ పట్టుబడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. అనుమానితులను బైండోవర్‌లు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా సారా మహమ్మారి బారినపడి అమాయకులు అనేక మంది అశువులుబాస్తున్నట్లు చెప్పారు. సారా జోలికి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. పచ్చటి పల్లెల్లో సారా తయారు చేస్తూ గ్రామీణ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకునే ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. పోలాటితిప్ప గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని గ్రామస్తులను ఆయన కోరారు. అనంతరం నవోదయం 2.0 పోస్టర్‌ను ఆవిష్కరించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పీ లక్ష్మణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎం రామశేషయ్య, ఎం రవి, బందరు రూరల్ ఎస్ఐ కే నాగరాజు, పోలాటితిప్ప సర్పంచ్ మోకా రాజు, పంచాయతీ కార్యదర్శి కే కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామాలయంలో ఆభరణాలు చోరీ



వివరాలు సేకరిస్తున్న సీఐ ఈశ్వరరావు, క్లూస్‌టీం

ఘంటసాల: మండల పరిధిలోని శ్రీకాకుళం శివారు శీలంవారిపాలెం రామాలయంలో సోమవారం అర్ధరాత్రి రూ. 4లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. శీలంవారిపాలెంలో వేంచేసియున్న కోదండ రామాలయంలో పూజలు నిర్వహించేందుకు అర్చకులు ముక్తేవి విష్ణువర్ధన్ మంగళవారం ఆలయానికి వెళ్లారు. ఆ సమయంలో ఆలయం తలుపులు తెరచి ఉండటంతో అనుమానం వచ్చి చూడగా ఆలయం తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఆలయం లోపల సామాన్లు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించి కమిటీ సభ్యులకు తెలియజేశారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ కే ప్రతాప్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆలయ సభ్యులు, అర్చకుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆలయంలోని సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలకు ఉండాల్సిన వెండి కిరీటాలు, సీతమ్మ వారికి ఉండాల్సిన రెండు సూత్రాలు, రాముల వారి వెండి జంధ్యం, వెండి బొట్టు, పళ్లం, వెండి శటగోపంను దొంగలు ఎత్తుకుపోయారు. వీటి విలువ రూ. 4లక్షలు ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. మచిలీపట్నం నుంచి వచ్చిన ప్రత్యేక క్లూస్‌టీం ఆలయంలో పలుచోట్ల ఆధారాలు సేకరించారు. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సీసీ రోడ్లు నిర్మించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న అంబటి బ్రహ్మణయ్య కాలనీవాసులు

కోడూరు: కోడూరు పంచాయతీ పరిధిలోని అంబటి బ్రహ్మణయ్య కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలంటూ గ్రామస్తులు మంగళవారం ఎంపీడీఓ సుధాప్రవీణ్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని సిల్క్ డెవలప్‌మెంట్ భవనం నుంచి కాలనీలోకి వెళ్లడానికి ఉపయోగపడే వంతెన శిథిలావస్థకు చేరిందని విన్నవించారు. కాలనీలో మొత్తం మట్టి రహదారులే కావడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కాలనీలో కనీసం ఒక్క సీసీ రోడ్డు కూడా లేదని తెలిపారు. వెంటనే సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు నూతన వంతెనను నిర్మించాలని గ్రామస్తులు వినతిపత్రంలో పేర్కొన్నారు.